



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

ఆదివారం,
డిసెంబర్ 29, 2024

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 10 | వెల 4/-


# ఆర్థిక సంస్కర్త మన్మోహన్‌సింగ్‌కు అంతిమ వీడ్కోలు

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు యావత్ భారతావని కన్నీటి నివాళులు

యమున ఒడ్డున
లాంఛనాలతో అంత్యక్రియలు

చితికి నిప్పంటించిన
పెద్ద కుమార్తె ఉపిందర్ సింగ్

రాష్ట్రపతి, ప్రధాని,
సోనియా, రాహుల్ నివాళి

శ్మశానవాటికలో
అంత్యక్రియలపై కాంగ్రెస్ అభ్యంతరం

స్మారకానికి స్థలమిస్తాం..
రాజకీయం తగదు: కేంద్రం



న్యూఢిల్లీ: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు యావత్ భారతావని కన్నీటి నివాళులర్పించింది. దేశ ఆర్థిక సంస్కర్తకు శనివారం ఉదయం ఢిల్లీలో యమునానది ఒడ్డున ఉన్న నిగమ్ బోధ్ ఘాట్‌లో కేంద్ర ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. మన్మోహన్‌సింగ్ చితికి ఆయన పెద్ద కుమార్తె ఉపిందర్‌సింగ్ నిప్పంటించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, స్పీకర్ ఓంబిర్లా, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్, త్రివిధ దళాల అధిపతులు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య సహా పలు రాష్ట్రాల సీఎంలు మన్మోహన్ అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించారు. ఆర్మీ ఫిరంగి వాహనంలో ఏఐసీసీ కార్యాలయం నుంచి మన్మోహన్ భౌతికకాయాన్ని నిగమ్ బోధ్ ఘాట్‌కు అంతిమయాత్రగా తీసుకొచ్చారు. అనంతరం 21 తుపాకులతో

- మిగతా 2వ పేజీలో



## మంచులో చిక్కుకున్న కశ్మీర్, హిమాచల్

### రోడ్లపై దట్టంగా మంచు..
### నిలిచిపోయిన వేలాది వాహనాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 28: చలిగాలులతో ఉత్తర భారతదేశం గడ్డకట్టుకుపోతోంది. జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లను మంచు దుప్పటి కప్పేస్తోంది. దట్టంగా కురుస్తున్న మంచు రోడ్లపై అంగుళాల మేర పేరుకుపోతోంది. దీంతో, ముందుకు కదలలేక వేలాది వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా కాజీగుండ్ ప్రాంతంలో శ్రీనగర్–జమ్మూ హైవేపై 2వేలకు పైగా వాహనాలు మంచులో చిక్కుకుపోయాయి. హిమాచల్‌ప్రదేశ్‌లోని కులూలో సోలాంగ్ నాలా మార్గంలో వెయ్యికి పైగా వాహనాలు, 5వేల మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. పోలీసులు రోడ్లపై మంచును తొలగించి వారిని సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. సహాయచర్యలు కొనసాగుతున్నాయి. మంచు కారణంగా శ్రీనగర్–లేహ్, శ్రీనగర్–జమ్మూ

- మిగతా 2వ పేజీలో




## 'ఫార్ములా- ఈ' రేసు కేసు

# 7న విచారణకు రండి

అంతకుముందే 2న బీఎల్ఎన్ రెడ్డి,

3న అర్విందకుమార్‌ను విచారించనున్న అధికారులు

వారికి కూడా సమన్లు జారీ...

విదేశీ సంస్థకు నేరుగా సొమ్ము బదిలీ చేయడంపైనే ఫోకస్

మనీలాండరింగ్‌తోపాటు ఫెమా కింద కూడా దర్యాప్తు

## సాగు భూమికే

# రైతుభరోసా



### శాటిలైట్ సర్వే ద్వారా సాగు విస్తీర్ణం వివరాల సేకరణ

### గ్రామాలు, పంట రకాలు, సర్వే నంబర్లవారీగా అధ్యయనం

### వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడి

హైదరాబాద్: పంటలు సాగుచేసిన భూమికే రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందించనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు. ఇందుకోసం శాటిలైట్ సర్వే ద్వారా రిమోట్ సెన్సింగ్ డేటాను వినియోగించనున్నట్లు తెలిపారు. సర్వే నంబర్లవారీగా సాగులో ఉన్న భూమి విస్తీర్ణంతోపాటు ఏ పంట ఎంత విస్తీర్ణంలో సాగైందనే వివరాలను రిమోట్ సెన్సింగ్ డేటాతో పొందవచ్చని చెప్పారు. ఈ సంక్రాంతి నుంచి 'రైతుభరోసా'ప్రారంభించనున్న నేపథ్యంలో శనివారం సచివాలయంలో రిమోట్ సెన్సింగ్ డేటా ఆధారంగా సాగు విస్తీర్ణాన్ని అంచనా వేసే వివిధ కంపెనీ ప్రతినిధులతో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

- మిగతా 2వ పేజీలో



## నోటీసులు ఇవ్వం..
## కూల్చివేతలు ఆపం.. హైడ్రా రంగనాథ్



## రేపు అసెంబ్లీ ప్రత్యేక భేటీ

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సంతాపం తెలపనున్న సభ

తెలంగాణ ఏర్పాటులో ఆయన సహకారాన్ని గుర్తు చేసుకుంటూ నివాళి

సోమవారం ఉదయం 10 గంటలకు శాసనసభ సమావేశం ప్రారంభం

## మన్మోహన్ స్మారకచిహ్నం కోసం కేంద్రం స్థలం కేటాయిస్తుంది... అయినా కాంగ్రెస్ రాజకీయం చేస్తోంది: కిషన్‌రెడ్డి



మాజీ ప్రధానులకు నిబంధనల ప్రకారమే
స్మారక స్థల కేటాయింపు ఉంటుందన్న కిషన్ రెడ్డి

ఖర్గేకు, మన్మోహన్ కుటుంబ సభ్యులకు
అమిత్ షా కూడా తెలిపారన్న కేంద్రమంత్రి

కాంగ్రెస్ రాజవంశానికి చెందని
ఆ పార్టీ ప్రధానులను కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శ

# ఆర్థిక సంస్కర్త మన్మోహన్‌సింగ్‌కు అంతిమ వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)

త్రివిధ దళాల సైనిక వందనం ఇచ్చాయి. మన్మోహన్ భార్య గురుశరణ్ కౌర్, పెద్ద కుమార్తె ఉపిందర్ సింగ్ , రెండో కుమార్తె దమన్ సింగ్, మూడో కుమార్తె అమృత్ సింగ్ నిగంబోధ్ ఘాట్ వద్ద అంత్యక్రియల్లో పాల్గొన్నారు. తన చివరి ప్రయాణంలోనూ డాక్టర్ మన్మోహన్‌సింగ్ తనకు ఇష్టమైన నీలి రంగు తలపాగా ధరించేలా ఏర్పాట్లు చేశారు. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నామ్‌గ్యాల్ వాంగ్‌చుక్ సహా పలువురు విదేశీ నేతలు సైతం అంత్యక్రియలకు హాజరయ్యారు. సిక్కు మత సంప్రదాయాల ప్రకారం ప్రార్థనలు నిర్వహించిన అనంతరం చితిని పేర్చి పార్థివదేహాన్ని దహనం చేశారు.



### ఏఐసీసీలో పార్థివదేహం

మన్మోహన్ గురువారం రాత్రి మృతి చెందగా శుక్రవారం ఆయన నివాసంలో పార్థివ దేహాన్ని ఉంచారు. శనివారం ఉదయం గురుద్వార్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, సుమారు 9 గంటలకు కాంగ్రెస్ ప్రధాన కార్యాలయానికి తీసుకొచ్చారు. అక్కడ మన్మోహన్‌సింగ్ భౌతిక కాయానికి కాంగ్రెస్ నేతలు ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంక సహా కాంగ్రెస్ నేతలు, అభిమానుల నివాళుల తర్వాత 10 గంటలకు అంతిమయాత్రను ప్రారంభించారు. రాహుల్‌గాంధీ మన్మోహన్ పాడెను మోశారు. పార్థివదేహంతో పాటు అదే వాహనంలో నిగమ్ ఘాట్‌కు వెళ్లారు. అదే వాహనంలో సీఎం రేవంత్ రెడ్డి సైతం ఉన్నారు. రాహుల్‌గాంధీ స్వయంగా రేవంత్‌రెడ్డిని పిలిచి పక్కనే కూర్చోబెట్టుకున్నారు. మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించిన వారిలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, దామోదర రాజ నరసింహ, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ నేతలు మల్లు రవి, బలరాం నాయక్, అనిల్ కుమార్ యాదవ్, సర్వే సత్యనారాయణ, కేవీపీ రామచంద్రరావు, బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేష్ రెడ్డి, దామోదర్ రావు, మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ తదితరులు ఉన్నారు.

### కాంగ్రెస్, బీజేపీ మాటల యుద్ధం

అంతిమ సంస్కారం, స్మారక స్థూపంపై కాంగ్రెస్, బీజేపీల మధ్య మాటల యుద్ధం జరిగింది. ప్రపంచ ప్రఖ్యాతి గడించిన మన్మోహన్‌ను బీజేపీ సర్కారు అవమానించిందని కాంగ్రెస్ ఆరోపించింది. ఆయన బతికున్నంత కాలం ఎప్పుడైనా గౌరవించారా? అంటూ బీజేపీ ఎదురు దాడికి దిగింది. స్మారక నిర్మాణం చేపట్టేందుకు వీలున్న స్థలంలోనే మన్మోహన్‌సింగ్ అంత్యక్రియలు నిర్వహించాలని కాంగ్రెస్ కోరింది. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే శుక్రవారం ఉదయం ప్రధాని మోదీతో ఫోన్‌లో ఈ విషయం మాట్లాడారు. ఆ తర్వాత లేఖ రాశారు. మాజీ ప్రధానులు, రాజనీతిజ్ఞులకు అంత్యక్రియలు నిర్వహించిన ప్రదేశంలోనే స్మారకాలు ఏర్పాటు చేయడం దేశంలో సంప్రదాయంగా వస్తోందని లేఖలో పేర్కొన్నారు. ఖర్గే లేఖపై కేంద్ర హోంశాఖ వివరణ ఇచ్చింది. మన్మోహన్ స్మారకం కోసం ప్రభుత్వం స్థలం కేటాయిస్తుందని తెలిపింది. స్మారకం నిర్మాణం కోసం ట్రస్టును ఏర్పాటు చేయాల్సి ఉంటుందని వెల్లడించింది. కేంద్రం స్పందించిన తీరుపై కాంగ్రెస్ అసహనం వ్యక్తం చేసింది. మరోవైపు, మన్మోహన్ మరణంపై కాంగ్రెస్ రాజకీయాలు చేస్తోందని బీజేపీ జాతీయ నేత సుధాన్షు త్రివేది మండిపడ్డారు. ఇదిలా ఉండగా, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ మరణించినప్పుడు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) కనీసం సంతాప సభ నిర్వహించలేదని ఆయన కుమార్తె శర్మిష్ట ముఖర్జీ మండిపడ్డారు. మన్మోహన్‌కు స్మారకం నిర్మించాలని ఖర్గే మోదీకి ప్రతిపాదన చేసిన నేపథ్యంలో శర్మిష్ట ఈ మేరకు 'ఎక్స్'లో స్పందించారు. '2020 ఆగస్టులో నాన్న చనిపోయినప్పుడు కాంగ్రెస్ నాయకత్వం కనీసం సంతాపం తెలిపేందుకు సీడబ్ల్యూసీ సమావేశాన్ని ఏర్పాటు చేయలేదు' అని శర్మిష్ట పేర్కొన్నారు.

మన్మోహన్‌ను కేంద్రం అవమానించిందని రాహుల్ ఆరోపించారు. "మన్మోహన్ భారతదేశానికి ముద్దుబిడ్డ. ఆయన హయాంలో దేశం ఎంతో అభివృద్ధి చెందింది. ఆర్థిక రంగంలో దేశం అద్భుతంగా ఎదగడంలో మన్మోహన్ సేవలు వెలకట్టలేనివి. అటువంటి గొప్ప మనిషిని ఎన్డీఏ ప్రభుత్వం అవమానించింది. ఇప్పటివరకు దేశానికి ప్రధానులుగా చేసిన వారికి అంత్యక్రియలు అధికారిక శ్మశాన వాటికలో జరిగేవి. దీనివల్ల ప్రధానుల అంతిమ సంస్కారాల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ ఎటువంటి ఇబ్బంది ఉండేది కాదు. మరి మన్మోహన్ సింగ్ విషయంలో మాత్రం ఢిల్లీలోని నిగమ్ బోధ్ ఘాట్‌లో నిర్వహించారు. అది ముమ్మాటికీ మన్మోహన్‌ను అవమానించడమే" అని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు.

# రేపు అసెంబ్లీ ప్రత్యేక భేటీ

హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ సోమవారం ప్రత్యేకంగా సమావేశం కానుంది. దేశాన్ని ఆర్థిక చిక్కుల నుంచి బయటపడేసి, అభివృద్ధి పథంలో పయనించేలా మార్గనిర్దేశం చేసిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులు అర్పించనుంది. దేశానికి మార్గం చూపిన ఆయనకు భారత రత్న ఇవ్వాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇటీవల జరిగిన శాసనసభ శీతాకాల సమావేశాల అనంతరం ఈ నెల 21న సభ నిరవధికంగా వాయిదాపడిన సంగతి తెలిసిందే. అయితే సభను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఇంకా ప్రోరోగ్ చేయకపోవడంతో.. ఈ నెల 30న సోమవారం ప్రత్యేక భేటీ నిర్వహించాలని నిర్ణయించారు. దీనిపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 10 గంటలకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ప్రారంభించనున్నట్టు శాసనసభ వ్యవహారాల కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు శనివారం లేఖ విడుదల చేశారు. ఈ ప్రత్యేక సమావేశం ఒక్కరోజుకే పరిమితం చేయనున్నారు.



### మన్మోహన్‌ను కొనియాడుతూ తీర్మానం

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 3వ తేదీ వరకు ఏడు రోజుల పాటు సంతాప దినాలుగా పాటిస్తున్నాయి. ఈ క్రమంలో మన్మోహన్ ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడటాన్ని గుర్తు చేసుకుంటూ, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో ఆయన కృషిని కొనియాడుతూ తీర్మానం చేయడం ద్వారా నివాళి అర్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇక ఆధునిక భారత దేశ ఆర్థిక సంస్కర్తగా పేరుగాంచిన మన్మోహన్‌కు 'భారతరత్న'ఇవ్వాలని కోరుతూ తీర్మానం చేసే అవకాశం ఉన్నట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

### ప్రత్యేక భేటీకి ప్రతిపక్ష నేత కేసీఆర్

మాజీ ప్రధాని మన్మోహన్‌కు నివాళి అర్పించేందుకు సోమవారం నిర్వహిస్తున్న అసెంబ్లీ ప్రత్యేక భేటీకి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు హాజరయ్యే అవకాశం ఉన్నట్టు తెలిసింది. మన్మోహన్ నేతృత్వంలోని కేబినెట్‌లో కొంతకాలం కేంద్ర మంత్రిగా పనిచేసిన కేసీఆర్.. పలు సందర్భాల్లో ఆయనతో అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కేసీఆర్ సీఎం అయ్యాక తెలంగాణ ఏర్పాటులో మన్మోహన్ సహకారాన్ని రికార్డుల్లో చేర్చాలని కోరుతూ అసెంబ్లీలో కేసీఆర్ ప్రసంగించారు కూడా. ఈ నేపథ్యంలో మన్మోహన్ కృషిని కొనియాడుతూ, నివాళి అర్పించే అసెంబ్లీ ప్రత్యేక భేటీకి ప్రతిపక్ష నేతగా కేసీఆర్ హాజరవుతారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి.



# సాహెూ నితీశ్..

మెల్‌బోర్న్: తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి (176 బంతుల్లో 105 నాటౌట్, 10 ఫోర్లు, 1 సిక్స్) వీరోచిత శతకంతో బాక్సింగ్ డే టెస్టులో భారత్ ఫాలోఆన్ గండాన్ని తప్పించుకోవడమే గాక మ్యాచ్‌పై పట్టు సాధించే ఆశలనూ మెరుగుపరుచుకుంది. నితీశ్‌తో పాటు వాషింగ్టన్ సుందర్ (162 బంతుల్లో 50, 1 ఫోర్) చరిత్రాత్మక ఇన్నింగ్స్ ఆడి భారత్‌ను ఫాలోఆన్ గండం నుంచి గట్టెక్కించడమే గాక కంగారూల ఆధిక్యాన్ని గణనీయంగా తగ్గించారు. ఈ ఇద్దరి పోరాటంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్.. 116 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 358 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో రోహిత్ సేన ఇంకా 116 పరుగులు వెనుకబడి ఉంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి నితీశ్‌కు అండగా సిరాజ్ (2 నాటౌట్) క్రీజులో ఉన్నాడు. ఆస్ట్రేలియాతో టెస్టులు అంటే ఈడెన్ గార్డెన్‌లో లక్ష్మణ్, ద్రావిడ్ రికార్డు భాగస్వామ్యం.. కంగారూల గడ్డపై సచిన్, కోహ్లీ శతక గర్జన.. గబ్బాలో రిషభ్ పంత్ మెరుపులు.. గత రెండు పర్యటనలలో పుజారా డిఫెన్స్ గుర్తొస్తాయి. వీటికేమాత్రం తీసిపోకుండా మెల్‌బోర్న్‌లో నితీశ్, సుందర్ చరిత్రాత్మక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఓవర్‌నైట్ స్కోరు 164/5తో మూడోరోజు ఆట ఆరంభించిన భారత్.. ఆరంభంలోనే రిషభ్ (28) వికెట్‌ను కోల్పోయింది. సిరీస్‌లో చెత్త ఆటతో విమర్శల పాలవుతున్న పంత్.. మళ్లీ ఓ చెత్త షాట్ ఆడి పెవిలియన్ చేరాడు. స్కోరుబోర్డుపై మరో 30 పరుగులు చేరగానే జడేజా (17) కూడా నిష్క్రమించాడు. ఈ క్రమంలో వాషింగ్టన్‌తో జతకలిసిన నితీశ్.. ఎంసీజీలో కంగారూలకు కొరకరాని కొయ్యగా మారాడు. ఆసీస్ బౌలర్లకు ఏమాత్రం అవకాశమివ్వకుండా నిలకడ ప్రదర్శించాడు. క్రీజులో నిలదొక్కుకునేదాకా షాట్ల జోలికి పోలేదు. లియాన్ బౌలింగ్‌లో లాంగాన్ మీదుగా భారీ సిక్సర్ బాదిన అతడు.. ఒక్కో పరుగును కూడగడుతూ స్కోరుబోర్డును ముందుకు నడిపించాడు. మరో ఎండ్‌లో సుందర్ అతడికి పూర్తి సహకారం అందించాడు. ఈ జోడీని విడదీసేందుకు కమిన్స్.. బౌలర్లను మార్చి మార్చి ప్రయోగించినా వారికి ఒక్క అవకాశం కూడా ఇవ్వకుండా జాగ్రత్తపడ్డారు. లంచ్ తర్వాత స్టార్క్ వేసిన ఓవర్లో మూడో బంతిని బౌండరీకి తరలించిన నితీశ్.. తన కెరీర్‌లో తొలి అర్ధ శతకాన్ని 80 బంతుల్లో పూర్తిచేశాడు. మార్ష్ బౌలింగ్‌లో రెండు బౌండరీలు బాదిన అతడు.. లియాన్ బౌలింగ్‌లో ఫోర్ కొట్టి 90లలోకి వచ్చాడు. ఇదే ఓవర్లో సుందర్ 146 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తిచేశాడు. కానీ డ్రింక్స్ విరామం తర్వాత అతడు.. లియాన్ బౌలింగ్‌లోనే స్లిప్స్‌లో స్మిత్‌కు క్యాచ్ ఇవ్వడంతో 127 పరుగుల 8వ వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. సుందర్ నిష్క్రమించే సమయానికి నితీశ్ 97 పరుగుల వద్ద ఉండగా కమిన్స్ మరుసటి ఓవర్లో బుమ్రాను ఔట్ చేశాడు. దీంతో అందర్లోనూ టెన్షన్ మొదలైంది. సిరాజ్ క్రీజులో ఉండగా నితీశ్ నాన్ స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్నాడు. కానీ సిరాజ్.. కమిన్స్ ఓవర్‌లో మూడు బంతులను కాపాడుకుని నితీశ్‌కు స్ట్రైక్ ఇచ్చాడు. బొలాండ్ వేసిన 115వ ఓవర్లో మూడో బంతిని మిడాన్ దిశగా బౌండరీ తరలించడంతో అతడి తొలి శతకం పూర్తయింది.

# వైసీపీ నేతలకు అహంకారం తలకెక్కింది..

కడప/రాయచోటి: "గతంలో ఎంపీడీవో ప్రతాపరెడ్డి, శేఖర్‌నాయక్, శ్రీనివాసులరెడ్డిపై దాడి చేశారు. ఇప్పుడు జవహర్‌బాబుపై దాడి చేశారు. వైసీపీ నేతలకు అహంకారం తలకెక్కింది. తోలుతీసి కూర్చోబెడతాం. ఆధిపత్యపు అహకారంతో దాడిచేస్తే మీ అహంకారాన్ని అణిచేస్తాం" అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. కూటమి ప్రభుత్వం త్రికరణశుద్ధితో పనిచేస్తోందని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఎలా నియంత్రించాలో తెలుసనని వ్యాఖ్యానించారు. "వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా గాలిలో విహరిస్తున్నారు. 11 సీట్లే వచ్చినా అహంకారం తగ్గలేదు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి కడప జిల్లా గాలివీడు మండలం ఎంపీడీవోపై శుక్రవారం దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ దాడిలో గాయపడి ప్రస్తుతం కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎంపీడీవో జవహర్‌బాబును శనివారం డిప్యూటీ సీఎం పరామర్శించారు. 15 నిమిషాల పాటు ఆసుపత్రిలో ఉండి ఎంపీడీవో ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జవహర్‌బాబు, ఆయన భార్య అర్చన, కుమార్తె హాన్సి, కుమారుడు వినీత్‌లను పరామర్శించి ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "గాలివీడు ఎంపీడీవోపై దాడి చేసిన వ్యక్తి జల్లా సుదర్శన్‌రెడ్డి. ఈయన లాయర్. స్టేట్ లా ప్రాసిక్యూషన్ ఆఫీసర్‌గా పనిచేసిన వ్యక్తి. ఆయన తల్లి మండల అధ్యక్షురాలు. తాళాలు అడిగితే ఇవ్వలేదని.. దాదాపు 11 మంది వ్యక్తులు దాడి చేశారు. కుటుంబ సభ్యులకు తాళాలు ఇవ్వడం కుదరదన్నందుకు ఇష్టానుసారం దాడికి తెగబడ్డారు. ఎంపీడీవో అంటే మండలానికి కలెక్టర్‌లాంటి వారు. ఆయనపై జరిగిన దాడిని రాష్ట్ర యంత్రాంగంపై జరిగిన దాడిగా భావించా" అని అన్నారు. జవహర్‌బాబును సుదర్శన్ రెడ్డి కులం పేరుతో దూషించినట్టు తెలిపారు.





# ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ

బాలాపూర్, వార్త మిర్రర్ : మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ జిల్లెలగూడ మిథిలా నగర్ కాలనీ శ్రీరస్తు కన్వెన్షన్ హాల్ లో జరిగిన శ్రీ ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్ గురుస్వామి 16 వార్డు డివిజన్ కార్పొరేటర్ 25వ "సం" శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమానికి మహేశ్వరం ఎమ్మెల్యే రాష్ట్ర మాజీ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి విచ్చేసి పూజలో పాల్గొనడం జరిగింది. 16వ డివిజన్ కార్పొరేటర్ ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్ ముద్రించిన 2025 క్యాలెండర్ ను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ మున్సిపల్ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి , ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి , గౌరవ కార్పొరేటర్లు సిద్దాల లార్డ్స్ బీరప్ప , దోమలపల్లి ధనలక్ష్మి రాజ్ కుమార్ , సిద్ధల పద్మ అంజయ్య, రాష్ట్ర బంజారా సంఘం నాయకులు ముడవత్ దీపులాల్ చౌహాన్ , జిల్లెలగూడ మాజీ ఎంపీటీసీ సభ్యురాలు శ్రీమతి ఎనుగుల అనిత అనిల్ కుమార్ యాదవ్, మీర్ పేట్ బి ఆర్ ఎస్ పార్టీ ప్రెసిడెంట్ అర్కల కామేష్ రెడ్డి , తుక్కుగూడ మున్సిపాలిటీ బి ఆర్ ఎస్ అధ్యక్షులు జల్లెల లక్ష్మయ్య యాదవ్ , టెంపుల్ డైరెక్టర్ మేకల యాదగిరి , బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్ గౌడ్ , మహేశ్వరం నియోజకవర్గ అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షులు మేకల కృష్ణ యాదవ్ , శ్రీశ్రీశ్రీ నవీన్ పిల్లై గురు స్వామి ,జీ కిరణ్ రాజ్ గురుస్వామి , మీర్ పేట్, జిల్లేలగూడ చుట్టు ప్రక్కల ఉన్న అయ్యప్పస్వామి దీక్షా స్వాములు మరియు భక్తులు పాల్గొన్నారు.

# ఆస్ట్రేలియా, జర్మనీకి చలో చలో!

న్యూఢిల్లీ, డిసెంబరు 28: ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు తమ ఇమిగ్రేషన్ విధానాలను సవరిస్తున్నాయి. కొన్ని దేశాలు వీసా నిబంధనలను సడలిస్తుంటే మరికొన్ని కొత్తగా పరిమితులు విధిస్తున్నాయి. ఈ మార్పుల ప్రభావం విదేశాల్లో ఉన్నత చదువులు అభ్యసించాలనుకొనే భారతీయ విద్యార్థులపై పడుతోంది. కొన్నేళ్లుగా మన దేశ విద్యార్థులకు అమెరికా, యూకే, కెనడా, ఆస్ట్రేలియా గమ్యస్థానాలుగా ఉన్నాయి. చదువు పూర్తయిన తర్వాత ఉపాధితో పాటు శాశ్వత నివాసానికి అవకాశం కల్పించే దేశాలవైపు ప్రస్తుతం విద్యార్థులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఈ విషయంలో ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ వంటి దేశాలు భారతీయ విద్యార్థులకు ఆకర్షణీయమైన ఎంపికలుగా మారుతున్నాయి. దీనికి విరుద్ధంగా అమెరికా, యూకే ఈ ప్రక్రియలను సరళతరం చేయడంలో సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఒకప్పుడు భారతీయ విద్యార్థులకు మొదటి ఎంపికగా ఉన్న అమెరికాకు కొంతకాలంగా దరఖాస్తులు తగ్గుముఖం పట్టాయి. సంక్లిష్టమైన వీసా నిబంధనలు, పెరుగుతున్న తిరస్కరణ రేట్లు, ఉద్యోగ భద్రతపై ఆందోళనలు వంటి అంశాలు విద్యార్థులను పునరాలోచనలో పడేస్తున్నాయి. ట్రంప్ మళ్లీ అధికారంలోకి రావడంతో భారతీయ విద్యార్థులకు మరింత అనుకూలమైన ఇమిగ్రేషన్ విధానాలు, గ్రీన్ కార్డు జారీలో సడలింపులు ఇస్తారన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. స్నేహపూర్వ వీసా విధానాలు, బలమైన మౌలిక సదుపాయాలతో భారతీయ విద్యార్థులకు కెనడా చాలాకాలంగా కీలక గమ్యస్థానంగా ఉంది. అయితే కఠినమైన ఇమిగ్రేషన్ నిబంధనలు, పరిమితమైన అనుమతులు దరఖాస్తుల సంఖ్య క్షీణతకు కారణమవుతున్నాయి. ఈ సవాళ్లు ఉన్నప్పటికీ 2024లో 4,37,000 స్టడీ పర్మిట్లను కేటాయించడం అంతర్జాతీయ విద్య పట్ల కెనడా నిబద్ధతకు నిదర్శనమని నిపుణులు పేర్కొంటున్నారు. భారతీయ విద్యార్థుల పట్ల యూకే మిశ్రమ వైఖరి కనబరిచింది. గ్రాడ్యుయేట్ విద్యార్థులు చదువులు పూర్తి చేసిన తర్వాత రెండేళ్ల పాటు పనిచేయడానికి అనుమతిస్తుంది. పీజీ విద్యార్థులు డిపెండెంట్లను తీసుకురావడంపై ఆంక్షలు విధించడం వారిని కలవరపెడుతోంది. విపరీతమైన రద్దీ, వనరుల కేటాయింపులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడంలో భాగంగా 2025 నాటికి విదేశీ విద్యార్థుల నమోదును 2,70,000కు పరిమితం చేయాలని ఆస్ట్రేలియా ప్రభుత్వం నిర్ణయించింది. ఆస్ట్రేలియా వర్సిటీల్లో సీట్ల కోసం పోటీ మరింత పెరిగినప్పటికీ కెనడా తరహాలో పొడిగించిన పోస్టు స్టడీ వర్క్ ప్రయోజనాలు విద్యార్థులను ఊరిస్తున్నాయి.

# మన్మోహన్ స్మారకచిహ్నాం కోసం కేంద్రం స్థలం కేటాయిస్తుంది... అయినా కాంగ్రెస్ రాజకీయం చేస్తోంది: కిషన్‌రెడ్డి

మన్మోహన్ సింగ్ స్మారక చిహ్నాం కోసం కేంద్ర ప్రభుత్వం స్థలాన్ని కేటాయిస్తుందని, ఇది మాజీ ప్రధానులందరికీ నిబంధనల ప్రకారమే జరుగుతుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. మన్మోహన్ సింగ్ మరణాన్ని కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని ఆరోపించారు. ఇది తమను నిరుత్సాహపరిచిందన్నారు. మన్మోహన్ అంత్యక్రియల విషయంలో తన వైఖరితో బీజేపీ ప్రభుత్వం ఆయనను అవమానించిందని, అంత్యక్రియలను అధికారిక స్మశాన వాటికలో కాకుండా నిగంబోధ్ ఘాట్ వద్ద జరిపిందని కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఈ విమర్శలపై కిషన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. నిబంధనల ప్రకారం మన్మోహన్ సింగ్ స్మారక చిహ్నాం కోసం స్థల కేటాయింపు జరుగుతుందని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా... ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, మన్మోహన్ కుటుంబ సభ్యులకు తెలియజేశారని, కానీ కాంగ్రెస్ మాత్రం రాజకీయం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ రాజవంశానికి చెందని (నెహ్రూ, గాంధీ కుటుంబానికి చెందని) ప్రధానులు పీవీ నర్సింహారావు, మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ అగ్రనేత ప్రణబ్ ముఖర్జీ వంటి వారిని ఆ పార్టీ నిరంతరం మోసం చేస్తూ... అవమానాలకు గురి చేసిందని ఆరోపించారు. ఈ విషయం చరిత్రే చెబుతోందన్నారు. మన్మోహన్ మరణానికి కాంగ్రెస్ సంతాపం తెలియజేసినప్పటికీ... ఆ పార్టీ ఆయనకు చేసిన అవమానాలను మనం విస్మరించకూడదన్నారు.

## పాఠశాల వార్షిక క్రీడా దినోత్సవం...

# క్రీడా ప్రతిభ, కౌశల్యాల మహోత్సవం

సికింద్రాబాద్, వార్త మిర్రర్ డిసెంబర్ 28 ....పల్లవి మోడల్ స్కూల్, తిరుమలగిరి వార్షిక క్రీడా దినోత్సవ వేడుక హైదరాబాద్ లోని షెనాయ్ క్రికెట్ గ్రౌండ్లో అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం విద్యార్థుల క్రీడా నైపుణ్యం, స్ఫూర్తి, జట్టుకృషిని ప్రదర్శించడమే కాకుండా, పాఠశాల సాంస్కృతిక మరియు అథ్లెటిక్ విలువలకు దర్పణంగా నిలిచింది.మైదానం అలంకరణ బహుళ రంగుల జెండాలు, టెలూన్లు, మరియు ఆకర్షణీయమైన బ్యానర్లతో మైదానాన్ని ఒక పండుగ వాతావరణంలోకి మార్చాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా జిల్లా రెవెన్యూ అధికారి, అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ వెంకటాచారి హాజరై ప్రారంభోపన్యాసం చేశారు. ఆయన క్రీడల ప్రాముఖ్యతను నొక్కిచెప్పుతూ, అవి క్రమశిక్షణ, దృఢ సంకల్పం, మరియు స్నేహభావం వంటి విలువలను ఎలా పెంపొందిస్తాయో వివరించారు. ఈ కార్యక్రమంలో నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు, అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు పి.సి. విగ్నేష్, స్కూల్ చైర్మన్ మల్కా కొమరయ్య, డైరెక్టర్ డా. ఎస్. కార్తీక్,సీఈవో మిస్టర్ మల్కా యశస్వి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. సుధా తురగ తదితరులు వారు తమ ప్రసంగాల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తూ, క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడంలో పాఠశాల చేసిన కృషిని ప్రశంసించారు.

ప్రదర్శన (పరేడ్) కార్యక్రమం ఆకట్టుకునే విధంగా ప్రారంభమైంది. విద్యార్థులు తమ తమ హౌస్కి చెందిన రంగు కోడ్లతో, సమన్వయం మరియు ఐక్యతకు ఉదాహరణగా ప్రదర్శనలో పాల్గొన్నారు. వారి క్రమశిక్షణ ప్రతి ఒక్కరినీ మెప్పించింది.ప్రాథమిక విద్యార్థుల కోసం 50 మీటర్ల పరుగు పందెం తో ప్రారంభమైన కార్యక్రమం, ఉన్నత స్థాయి విద్యార్థులకు 100 మీటర్ల పరుగు పందెం వరకు సాగాయి. విద్యార్థుల గెలుపు నిశ్చయత మరియు చురుకుదనం, ప్రేక్షకుల నుండి అపూర్వమైన ప్రోత్సాహాన్ని పొందాయి. ముఖ్యమైన క్రీడా కార్యక్రమాలు లాంగ్ జంప్, హై జంప్ ప్రదర్శనలు విద్యార్థులు క్రియాశీలతను మరియు సృజనాత్మకతను ప్రదర్శించే డ్రిల్లు మరియు స్టంట్లు చేశారు. కొన్ని ప్రత్యేకమైన ప్రదర్శనలు ఈ విధంగా ఉన్నాయి. పిరమిడ్



నిర్మాణం: 7, 8 తరగతుల విద్యార్థుల సమన్వయం, టీమ్వర్క్ నిదర్శనం. తైక్వాండో, జిమ్నాస్టిక్స్: అద్భుతమైన శారీరక సామర్థ్యాన్ని చూపిస్తూ, ఎంతో ప్రశంసలు పొందాయి.

క్రీడా దిగ్గజాల గౌరవం: బ్యాడ్మింటన్, హాకీ, క్రికెట్ మరియు బాక్సింగ్ అంకితం చేసిన ప్రదర్శనలు. ముఖ్యంగా ఎంఎస్ ధోనీ, మేరీ కోమ్ విజయాలను ఘనంగా ప్రస్తావించారు.ముగింపు మరియు పురస్కార వితరణ ఈ కార్యక్రమం భారతదేశ ఒలింపిక్ విజేతలకు సమర్పణతో ముగిసింది. వారు విజయాలు సాధించడంలో చూపిన పట్టుదల ప్రతి ఒక్కరికీ ప్రేరణగా నిలిచింది. ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి సాగర్ తమ ముగింపు ప్రసంగంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. క్రీడా దినోత్సవం కేవలం ఆటలకు మాత్రమే పరిమితం కాకుండా, జట్టు స్పిరిట్, క్రీడా స్ఫూర్తి, మరియు సమగ్ర అభివృద్ధికి ఓ స్ఫూర్తిదాయక దృశ్యమని ఆమె పేర్కొన్నారు.

# దొడ్డి కొమురయ్య విగ్రహం ఆవిష్కరణ విజయవంతం చేయండి



### లాయర్స్ ఫోరం

### రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నర్రి స్వామి కురుమ

సంస్థాన్ నారాయణపూర్ డిసెంబర్ 28 :( వార్తా మిర్రర్) నారాయణపూర్ మండలంలోని మల్లారెడ్డి గూడెం గ్రామంలో తెలంగాణ రైతాంగ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరించే కార్యక్రమాన్ని రేపు నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ,లాయర్స్ ఫోరం పర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , మునుగోడు నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం కంటెస్టెండ్ ఎంపీ అభ్యర్థి చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ లైబ్రరీ కార్యదర్శి హైకోర్టు ప్రముఖ న్యాయవాది నర్రి స్వామి కురుమ నీ ఆహ్వానిస్తూ మల్లారెడ్డిగూడెం కురుమ సంఘం నాయకులు ప్రజలు ఆహ్వాన పత్రాన్ని అందజేయడం జరిగింది ఈ సందర్భంగా హైకోర్టు ప్రముఖ న్యాయవాది నర్రి స్వామి కురుమ మాట్లాడుతూ సామాజిక చైతన్యం కోసం ఆరోజు రైతాంగ పోరాటంలో ప్రాణాలు అర్పించిన దొడ్డి కొమురయ్య విగ్రహానికి నా వంతు సహాయంగా ఆర్థిక సాయం అందించడం అదేవిధంగా ఆరోజు కార్యక్రమానికి వచ్చే ప్రజలకు అన్నదానం చేసే కార్యక్రమానికి నా వంతు సహకారం అందించడం చాలా సంతోషకరం మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని రాబోయే రోజుల్లో రాజ్యాధికారం దిశగా ప్రయాణం చేయాలని కోరుకుంటున్నాను అన్నారు రేపు జరిగే కార్యక్రమానికి తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర స్థాయి కార్యకర్తలు గ్రామ మండల నాయకులందరూ పాల్గొనాలని అదేవిధంగా వివిధ గ్రామాల ప్రజలందరూ కూడా పాల్గొని విజయవంతం చేయాలని కోరుకుంటున్నాం అన్నారు ఈ కార్యక్రమంలో తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు ముషాం చంద్రశేఖర్, నక్కరాజు, శ్రీరామ్ అనినుమల్ల,మజ్జిగ కృష్ణ, రామ్ ప్రతిజ్ఞ చారి, దువ్వ నవీన్, కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు

# పోలీసు కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు జరిగే మైదానంను సందర్శించి ఏర్పాట్లలను పరిశీలించిన జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా, ఐపిఎస్

విశాఖపట్నం వార్త మిర్రర్ : పోలీస్ కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా అన్ని చర్యలు చేపట్టాలి అని అధికారులకి ఆదేశాలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ రిక్రూట్మెంట్ బోర్డు (APSLRB) పోలీసు నియామక పక్రియలో భాగంగా ఉమ్మడి విశాఖపట్నం ( అనకాపల్లి ,విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు ) జిల్లా కు సంబంధించి పోలీసుకానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు విశాఖపట్నం లో కైలాసగిరి వద్ద గల అనకాపల్లి జిల్లా డిస్ట్రిక్ట్ ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ మైదానం నందు డిసెంబర్ 30 వ తేది నుండి ఫిబ్రవరి 1 వరకు దేహదారుఢ్య పరీక్షలు జరగనున్నాయని జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా ఐపిఎస్., తెలిపారు. ఈ దేహదారుఢ్య పరీక్షలకు సుమారు 11568 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. వీరి లో పురుష అభ్యర్థులు 9414 మంది ,మహిళా అభ్యర్థులు 2154 మంది ఉన్నారు. ఈ సంధర్భంగా శనివారం పరీక్షల నిర్వహణలో పాల్గొనే పోలీసు సిబ్బందితో కైలాసగిరి వద్ద గల అనకాపల్లి జిల్లా డిస్ట్రిక్ట్ ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ మైదానం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమం లో జిల్లా ఎస్పీ గారు సమావేశమై మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ రిక్రూట్మెంట్ బోర్డు (APSLRB) ఆదేశాలు, నియమ నిబంధనలు మేరకు ఈ పరీక్షలు సక్రమంగా , ప్రణాళికా బద్ధంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పరీక్షల నిర్వహణ కొరకు అధికారులు మరియు సిబ్బందికి బాధ్యతల పై అవగాహన కల్పించారు. ఫిజికల్ మెజర్మెంట్ & ఎఫిషియన్సీ పరీక్షలను ప్రణాళికాబద్ధంగా, సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఎలాంటి అవరోధాలు లేకుండా పూర్తి పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి. హై స్పీడ్ ఇంటర్నెట్, అడ్వాన్స్డ్ సిస్టమ్స్ మరియు ప్రింటర్స్ ను సమకూర్చుకొని వెరిఫికేషన్ ప్రక్రియ మొత్తం సజావుగా జరిగేలా చూసుకోవాలని సూచనలు చేశారు. నియామక ప్రక్రియ యావత్తు సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణలో జరిగేలా చర్యలుండాలి. పరీక్షల నిర్వహించే ప్రతి ప్రదేశం CC కెమెరా పర్యవేక్షణ ఉండేలా ఖచ్చితమైన ఏర్పాట్లు చేయాలి. అభ్యర్థులు అడుగుపెట్టిన మెయిన్ గేట్ ప్రవేశం దగ్గర నుండి ఎవరికి ఎలాంటి కన్ఫ్యూజన్ లేకుండా డాక్యుమెంట్ వెరిఫికేషన్,బయో మెట్రిక్ , బ్యాగేజ్ కౌంటర్ ,ఫిజికల్ మెజర్మెంట్ టెస్ట్ (PMT), ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ (PET) జరిగే అన్ని ప్రదేశాలను సూచించే విధంగా నేమ్ బోర్డులను ఏర్పాటు చేయాలి. సెన్సార్ ద్వారా జరిగే ప్రక్రియ మొత్తం సైంటిఫిక్ గా ఎలాంటి అవరోధాలు లేకుండా చూసుకోవాలని, మ్యాన్యువల్ గా జరిగే ప్రదేశంలో పూర్తి పారదర్శంగా నిర్వహించాలని తెలిపారు. రన్నర్ పాత్ర ఎంతో ముఖ్యమైనదని అని కాబట్టి రన్నర్ లు




జాగ్రత్తగా ఉండి తనకి ఇచ్చిన అభ్యర్థులందరినీ మొదటి నుంచి చివరి వరకు తనతో పాటు ఉండేటట్లు చూసికొని అన్ని ఈవెంట్లు సక్రమంగా పూర్తి చేసే బాధ్యత రన్నర్ కి ఉంటుంది అని తెలియజేశారు. మిగిలిన సిబ్బంది అంతా కూడా తమకు కేటాయించిన ఉద్యోగాలను విధిగా ,సక్రమంగా నిర్వర్తించాలని తెలియజేశారు. అభ్యర్థులకు టాయిలెట్లను, మంచినీటి సదుపాయం, వైద్య సదుపాయం, ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలి. అభ్యర్దుల పట్ల మర్యాదగా, హుందాగా, , నిష్పక్షపాతముగా వ్యవహరించాలి. ఉద్యోగం సాధించాలనే ఒత్తిడిలో అభ్యర్దులు ఉంటారని, వారి పట్ల మర్యాదగా , సహనంతో వ్యవహరించాలని పోలీసుసిబ్బందికి జిల్లా ఎస్పీ గారు సూచించారు.

రిజల్ట్ కౌంటర్ వరకు అంచెలంచెలుగా సమగ్రంగా విధులు నిర్వర్తించేలా అవగాహన చేశారు. ఎమైనా సందేహాలు, సమస్యలుంటే పోలీసు ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. పోలీసు కానిస్టేబుళ్ళ దేహదారుఢ్య పరీక్షల రిక్రూట్ మెంట్ పూర్తయ్యే వరకు అందరూ బాగా పని చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీ ఎల్ మోహన్ రావు , ఎస్బీ డిఎస్పీ శ్రీ బి అప్పా రావు , ఎఆర్ డిఎస్పీ శ్రీ పి నాగేశ్వర రావు, ఎస్బీ ఇన్స్పెక్టర్ శ్రీ బాల సూర్యరావు , ఆర్ ఐ లు శ్రీ ఎల్ మన్మధరావు, శ్రీ బి. రామకృష్ణారావు,ఐటి కోర్ ఎస్సై శ్రీ బి సురేష్ బాబు ,జిల్లాలో ఉన్న ఇతర అధికారులు , సిబ్బంది మరియు జిల్లా పోలీసు కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ,సూపరింటెండెంట్లు , డిపిఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బిజెపి సీనియర్ నాయకులు, శక్తి ఇన్ఫ్రా డెవలపర్స్ అధినేత బోడ వెంకటరమణ గౌడ్ జన్మదిన వేడుకలు

### చత్రపతి శివాజీ ఫోటోను అందజేసిన మిత్రబృందం

హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : హయత్ నగర్ శక్తి ఇన్ఫ్రా డెవలపర్స్ ఆఫీసులో బిజెపి సీనియర్ నాయకులు, శక్తి ఇన్ఫ్రా డెవలపర్స్ అధినేత బోడ వెంకటరమణా గౌడ్ జన్మదిన వేడుకల్ని మిత్రులు, ప్రముఖ నాయకులు, రియల్ ఎస్టేట్ అధినేతలు ఘనంగా నిర్వహించారు, భాగ్యనగరం నలుమూలల నుంచి మిత్రులు, బిజెపి నాయకులు, రియల్ ఎస్టేట్ అధినేతలు హయత్ నగర్ శక్తి ఇన్ఫ్రా డెవలపర్స్ కార్యాలయానికి చేరుకొని బోడ వెంకటరమణా గౌడ్(పులి) కు కేక్ కట్ చేయించి, శాలువాతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ప్రముఖ నాయకులు మాట్లాడుతూ బోడ వెంకటరమణ గౌడ్ స్నేహానికి విలువ నిచ్చే గొప్ప వ్యక్తిని అన్నారు, రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నీతి నియమాలను పేద మధ్య తరగతి ప్రజలతో ఇన్వెస్ట్ చేపించి వారిని ఆర్థికంగా బలపడేలా చూడడమే లక్ష్యంగా పనిచేస్తారని అన్నారు,ఇటు రాజకీయంలో భారతీయ జనతా పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తారని మిత్రులు కొనియాడారు, బోడ వెంకటరమణా గౌడ్ పుట్టినరోజు సందర్భంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో బోడ యాదగిరి గౌడ్, వార్త మిర్రర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గణేష్ సాగర్, వర్కల దానయ్య గౌడ్, కుక్కుటపల్లి రాజేష్, చంద్రమోహన్ గౌడ్, మల్లెల రవి, బొంగు కిరణ్ కుమార్ గౌడ్, నరేష్ యాదవ్, మహదేవ్ చారి, శంకర్ తదితరులు పాల్గొన్నారు





## రోడ్డును ఆక్రమించుకుంటున్న వ్యక్తులపై తగు చర్యలు తీసుకోండి. పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

వార్త మిర్రర్ శంషాబాద్ : దశాబ్దులపాటు పంట పొలాలకు వినియోగించుకుంటున్న రోడ్డును కొంతమంది ఆక్రమించుకొని ఇది తమ పొలం అంటూ వివాదం చోటు చేసుకుంది. సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు ఫిర్యాదు అనంతరం బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిధిలోని బహదూర్ గూడ. సర్వే నెంబర్ 24 లో నుండి తమ పంట ల లకు దారి ఉందని గతంలో సదరు సర్వేనెంబర్ నిర్వాహకులకు రోడ్డు కోసం కొంత డబ్బు కూడా చెల్లించడం జరిగిందని. వ్యక్తులు అప్పుడు అన్ని రకాల డబ్బులు తీసుకుని ఇప్పుడు మేము డబ్బులు తీసుకోలేదని బొకాయించడం జరుగుతుంది వారికి డబ్బు ఇచ్చిన పేపర్లతో సహా అన్ని ఉన్నవని భూములకు ధరలు రాగానే సదరు వ్యక్తులు ఇది దారి కాదని మా పంట పొలం అని దారిలో మొత్తం కడీలు ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని. సదరు వ్యక్తులపై తగు చర్యలు తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు ఈ సందర్భంగా శంషాబాద్ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు సదరు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు



## రిహార్సల్స్ నేవి డే

విశాఖపట్నం వార్త మిర్రర్ : ఆర్కే బీచ్‌లో ఇండియన్ నేవీ రిహార్సల్స్. హాక్ యుద్ధ వి మానాలు, చేతక్ హెలికాప్టర్లతో విన్యాసాలు. జనవరి 4న జరగనున్న నేవీ డే కొనసాగింపు వేడుకలకు రిహార్సల్స్. నేవి డే వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరుకానున్న సీఎం చంద్రబాబు.





## 7, 8 వార్డులలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన: శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

శంకర్‌పల్లి : డిసెంబర్:28:(వార్త మిర్రర్) : ప్రతి లబ్ధిదారుడు ఇంటి వద్ద ఉండి ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు సహకరించాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మున్సిపల్ పరిధి 7, 8 వార్డులలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎటువంటి తప్పులు లేకుండా వివరాలు నమోదు చేస్తేనే అందరికీ ఇండ్ల అవకాశాలు అందుబాటులో ఉంటాయి అని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో అర్హులైన పేదలకు న్యాయం చేయాల్సిన ఆవశ్యకత ఉందని వార్డు ఆఫీసర్లకు కమిషనర్ శ్రీనివాస్ సూచించారు.

# ప్రత్యేక తెలంగాణ ఉద్యమ పునాది ఖమ్మం కేంద్రంగా
# బీసీల రాజ్యాధికార ఉద్యమ నిర్మాణం

**ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కానరాని బిసి ప్రజా ప్రతినిధులు**

**రాష్ట్రంలో తీవ్ర వివక్షతకు లోనవుతున్న బీసీలు**

**దాసు సురేశ్ - వ్యవస్థాపక అధ్యక్షులు , బీసీ రాజ్యాధికార సమితి**



ఖమ్మం వార్త మిర్రర్ ప్రతినిధి (ఏలే భాస్కర్) : ఉద్యమాలకు, పోరాటాలకు, ప్రజా విప్లవాలకు నిలయమైన ఖమ్మం జిల్లా కేంద్రంగా బీసీల రాజ్యాధికార ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ ఉద్ఘాటించారు.. శనివారం ఖమ్మంలోని పూలే అంబెడ్కర్ అధ్యయన వేదికలో జిల్లా ఇంచార్జి గండి వీరేందర్ నేతృత్వంలో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా బీసీ ముఖ్య సమావేశానికి అనేకమంది బీసీ ప్రముఖులు హాజరయ్యి రాజ్యాధికార నినాదాలు చేశారు..స్థానిక బీసీ నాయకులతో కలిసి ప్రముఖ బీసీ నాయకులు వీజీఆర్ నారగోనితో కలిసి పూలే అంబెడ్కర్ చిత్ర పటాలకు పూల మాలలు సమర్పించారు. తదనంతరం సమావేశాన్ని ఉద్దేశించి దాసు సురేశ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రానున్నది బీసీల రాజ్యమేనన్నారు.ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి 1969 లోనే పునాది వేసిన ఖమ్మం జిల్లా కేంద్రంగా బీసీల రాజ్యాధికార ఉద్యమ నిర్మాణాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. రాష్ట్రంలో దేశంలో అగ్రకులాలు బీసీల వ్యాపార , రాజకీయ అవకాశాలను హరిస్తున్నాయని ఆరోపించారు .. ఊరికి ఒకరు కలిసి వస్తే రాష్ట్రంలో, దేశంలో రాజకీయ పార్టీలకు బీసీల పట్ల అనివార్యత సృష్టిస్తామని., ఇంటికొకరు కలిసి వస్తే రాజ్యాధికారాన్ని అట్టడుగు వర్గాల చేతిలో బహుమతిగా అందిస్తామని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ పిలుపునిచ్చారు..రాజ్యాధికారం కోసం బీసీలు చేస్తున్నది ధర్మ పోరాటమని పేర్కొన్నారు. బీసీల ఓట్లను బయటకు పోకుండా కట్టడిచేసేలా వ్యూహాలను రచిస్తామన్నారు. ఖమ్మం రాజకీయాల్లో సామాజిక న్యాయం కొరవడిందని మండిపడ్డాడు. ఖమ్మం లో 28 లక్షల జనాభా ఉండగా అందులో 80% బడుగు బలహీన వర్గాలు గిరిజన తెగలు ఉండగా అధికారంలో ఇప్పటికి 80% అగ్రవర్ణాలే ఉన్నాయన్నారు.50 శాతం బీసీ జనాభా పైబడిన ఖమ్మం జిల్లా వ్యాప్తంగా బిసి ప్రజా ప్రతినిధులు ప్రాతినిధ్యం కనిపించకుండా పోయిందని మండి పడ్డారు. ఆత్మగౌరవం కోసమే బీసీలు రాజ్యాధికార బాట పట్టారన్నారు..సామాజిక బాధ్యతను సినీ ఇండస్ట్రీకి సూచించిన ముఖ్యమంత్రి బీసీలకు రాజకీయ,సామాజిక న్యాయాన్ని నిర్వర్తించాలన్నారు .కనుక అన్ని మండలాల్లో, నియోజవర్గాల్లో త్వరలోనే పూర్తిస్థాయి కమిటీల నిర్మాణం గావిస్తూ .స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీల రాజ్యాధికారం కోసం త్వరలోనే రాష్ట్ర వ్యాప్త పర్యటన చేపడతామన్నారు.. సోషల్ జస్టిస్ జేఏసీ చైర్మన్ వీజీఆర్ నారగోని మాట్లాడుతూ అట్టడుగు వర్గాలు,బీసీలు రాజ్యాధికారం కోసం పోరాడకపోవడం వల్లనే అగ్రవర్ణాల అజమాయిషి కొనసాగుతుందన్నారు.. అధికారం కోసం బీసీలు తిరగబడితే అనివార్యంగా అగ్రవర్ణాలు వారి కుర్చీలు ఖాళీ చేసే రోజు ఎంతో దూరంలో లేదని వెల్లడించారు.అగ్రవర్ణాల ప్రజలు తమ వాటాను తాము అనుభవించుకుంటూనే బీసీ ఎస్సీ,ఎస్టీల, గిరిజన వాటాను కూడా అనుభవిస్తామనడం ఏ మేరకు సమంజసం అన్నారు.. ఇకపై అగ్రవర్ణాల వాటా అగ్రవర్ణాలు., అట్టడుగు వర్గాల వాటా అట్టడుగు వర్గాలు అనుభవించేలా సామాజిక న్యాయాన్ని సాధిస్తామన్నారు.. రాష్ట్ర మహిళా నాయకురాలు కొండా పద్మ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఉపకరించే విధంగా తమిళనాడు తరహాలో రాష్ట్రంలో ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ల అమలును రద్దు చేయాలని కోరారు.. బీసీలు సమర్థమైన నాయకులను తయారు చేసుకోకపోవడం, నిర్ణయాలు జరిగే అసెంబ్లీ పార్లమెంటులలో ఈ వర్గాలు లేకపోవడం వల్లనే ఇటువంటి దారుణాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర సెక్రటరీ ముంజాల రాజేందర్ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ ,బొమ్మగాని ధర్మభిక్షంల అడుగుజాడల్లో ఖమ్మంలో బీసీల నాయకత్వాన్ని బలోపేతంచేస్తామన్నారు.. యువత,మహిళలు రాజకీయాల్లోకి రానంతవరకు ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగుతాయని తెలిపారు.. ఈ పరిస్థితులను అధిగమించేలా ఇప్పటికే క్షేత్రస్థాయిలో బీసీల నాయకత్వాన్ని బలోపేతం చేస్తూ అన్ని జిల్లాలలో నాయకత్వ నిర్మాణాన్ని చేపట్టామని,యువ నాయకులను,మహిళలనుప్రోత్సహిస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో వారిని పోటీకి దింపనున్నామన్నారు. ప్రముఖ న్యాయవాది విజయశాంతి మాట్లాడుతూ 103వ రాజ్యాంగ సవరణ ద్వారా 2019లో ప్రవేశపెట్టిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల ద్వారా నేడు అట్టడుగు వర్గాలకు విద్య ఉద్యోగ అవకాశాలు అందక యువత నైరాశంలోకి నెట్టబడి పరిస్థితులు దయనీయంగా మారాయన్నారు. 8 లక్షల పైబడిన సంపాదన ఉన్న బీసీ వర్గాలను క్రిమి లేయర్ గా అభివర్ణిస్తు వారిని రిజర్వేషన్లకు దూరం చేస్తూ 8 లక్షల సంపాదన ఉన్న అగ్రవర్ణ విద్యార్థులను మాత్రం కేంద్ర ప్రభుత్వం పేదవారుగా పరిగణించడం ఏ మేరకు సమంజసమన్నారు ... ఈ కార్యక్రమంమంలో రాష్ట్ర ముఖ్య సహాదారుడు,సుంకరి శ్రీనివాస్, కత్తి విజయ్ గౌడ్,,వెంకటస్వామి, బండి నాగేశ్వరరావు గౌడ్, ఖమ్మం ఇన్చార్జి, పొడగంటి రాంబాబు చారి, జనసభ రాష్ట్ర సెక్రటరీ, జూలూరి రమేష్ గౌడ్,కొడుపు గంటి శ్రీధర్, పల్లెపు సోమరాజు, పెరుగు రమణ, టీవీ రాజ్ గురు, నగ్ర మల్లయ్య, కర్నే రామారావు, తామర కొండ కొమరయ్య, మహిళా నాయకురాలు అచ్చ నాగమణి, కొలిపాక నాగమణి ఖమ్మం బీసీ వాసులు అధికసంఖ్యలో పాల్గొనీ బీసీ సమస్యలను దయానేయ స్థితిని కళ్ళకు కట్టినట్టు చెప్పారు. బీసీ లు ఇకనైనా సంగటితం కావాలని మన హక్కులు మనమే ముకుమ్మడి గా సాధిచుకోవాలని దాసు సురేష్ గారు పిలుపు నిస్తూ,రాజ్యాధికార సమితి,క్యాలెండరు ఆవిష్కరణ చేసారు.

# భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహాపడిపూజ





కల్వకుర్తి ఊర్కొండ డిసెంబర్ 28 వార్త మిర్రర్ ప్రతినిధి:- ఊర్కొండ మండల కేంద్రంలో గేటు వద్ద శ్రీధర్ రావు, వంశీధర్ రెడ్డికి చెందిన ఎస్ వి ఇన్ఫ్రా ప్రాజెక్ట్ లో అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహెూత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ మహా పడిపూజ కార్యక్రమానికి గ్రామాల ప్రజలు,అయ్యప్ప స్వాములు, అయ్యప్ప భక్తులు ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర నాయకులు ముఖ్య అతిథిగా ముచ్చర్ల జనార్దన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.ఇలాంటి కార్యక్రమాలో పాల్గొనడం అభినందనీయమని ధర్మ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నారు. ప్రజల పై అయ్యప్ప స్వామి కృప చల్లని చూపు తప్పక ఉంటుందని పేర్కొన్నాడు. ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో రైతన్నలకు పంటలు సమృద్ధిగా పండేలా స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు.ఆలయాలు మానసిక ఉల్లాసానికి కేంద్రాలుగా విరజిల్లుతాయని ఆయన అభిప్రాయపడ్డాడు. అదేవిధంగా కల్వకుర్తి లో అయ్యప్ప ఆలయ నిర్మాణానికి రూ”200,000 (రెండు లక్షలు) విరాళం అందిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు,వివిధ గ్రామస్తులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు



# సంస్థాన్‌లో హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి మహా పడిపూజ

సంస్థాన్ నారాయణపూర్ డిసెంబర్ 28:( వార్త మిర్రర్) నారాయణపూర్ మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ పరిహార క్షేత్రం అయ్యప్ప స్వామి సన్నిధానంలో శనివారం స్థానిక మాజీ ఎంపీటీసీ బచ్చునగోని గాలయ్య యాదవ్ కుమారులు కిరణ్ స్వామి, అరుణ్ స్వామి ఆధ్వర్యంలో, గణపతి పూజ, సుబ్రహ్మణ్య స్వామి పూజ, అభిషేకాలు, అయ్యప్ప పూజ, అనంతరం మహా పడిపూజ నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములకు భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి గురు స్వాములు సోమనబోయిన ఐలయ్య యాదవ్, చిలువేరు జంగయ్య, బాలగోని బాలరాజు, దూసరి వెంకటేశం గౌడ్, చిలువేరు యాదయ్య, చిలువేరు సాయిబాబా, బొమ్మగాని రఘు, ఏపూరి మహేష్, జనగాం శ్రీను, సాయి, గవ్వల జంగయ్య, శివ, ప్రవీణ్, ప్రసాద్, వంశీ, బాలకృష్ణ, మారుతి, కార్తిక్ మరియు భక్తులు తలారి వంశీ పందుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## రెండో రోజు టోకెన్ సమ్మె లో గ్రామ పంచాయతీ కార్మికులు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 28 : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికై రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర జేఏసీ పిలుపు లో బాగంగా శనివారం రెండో రోజున సారంగాపూర్ ఎంపీడివో కార్యాలయం ఎదుట తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ సారంగాపూర్ మండల కమిటీ గ్రామ పంచాయతీ కార్మికులు టోకెన్ సమ్మె లో పాల్గొన్నారు. మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని జీ వో నెంబర్ 51 నీ సవరించాలని ఎన్నికలలో ప్రభుత్వం ఇచ్చిన హామీల మ్యాన్ పేస్టు అమలు చేయాలని , రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల డిమాండ్ల పరిష్కారం కొరకు రాష్ట్ర జేఏసీ తో ఈ టోకెన్ సమ్మె తోటైన 2025 జనవరి 03 వరకు ప్రభుత్వం చర్చలు జరిపి న్యాయం చేయాలని లేనిచో రాష్ట్ర వ్యాప్తంగా జేఏసీ ఆధ్వర్యంలో జనవరి 04 నుండి నిరవధిక సమ్మె లోకి వెళ్తున్నామని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ లో విధులు నిర్వహిస్తున్న వారు అత్యధికంగా పేద దళిత, బడుగు, బలహీన వర్గాలకు చెందిన మేము నిత్యం ప్రతి రోజు ప్రజలకు అందుబాటులో ఉండి అత్యవసర సేవలు అందించే ఈ గ్రామ పంచాయతీ కార్మికులను సమ్మెలోకి పోకముందు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేని యెడల సమ్మెలోకి వెళ్తే ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే ప్రభుత్వానిదే బాధ్యత వహించాలి. అనంతరం జనవరి 04 నుండి నిరవధిక సమ్మె లోకి వెళ్తున్నామని గౌరవ మండల పరిషత్ అభివృద్ధి అధికారి గారికి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. రెండవ రోజు సమ్మెలో పాల్గొన్న సిబ్బంది తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జగిత్యాల జిల్లా కమిటీ కార్యదర్శి పులి మల్లేశం, గంగలచ్చన్న, కొండయ్య, సుందర్, లక్ష్మీ రాజం, రాజన్న దుబ్బయ , పోశాని, పోషవ్వ, నిర్మల, గంగమ్మ, లక్ష్మి, భక్కవ్వ పాల్గొన్నారు.



## మిర్జాగూడ గ్రామ బీజేపీ 112,113,114,115 బూత్ కమిటీ అధ్యక్షుల ఎన్నిక

శంకర్‌పల్లి : డిసెంబర్:28: (వార్త మిర్రర్) : శంకర్‌పల్లి మండల పరిధిలోని మిర్జాగూడ గ్రామ బిజెపి బూత్ కమిటీ అధ్యక్షుల ఎన్నిక శనివారం మండల పార్టీ అధ్యక్షుడు బసగళ్ల రాములు గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా 112,113,114,115 బూత్ కమిటీల అధ్యక్షులుగా విజయ్ సింగ్, బాలకృష్ణ, రాములు, రామచంద్రయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం పార్టీ అధ్యక్షుడు రాములు గౌడ్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి బిజెపితోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి కుంటు పడిందన్నారు. కేంద్రంలో పీఎం మోదీ అమలు చేస్తున్న పథకాలను రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు. రాష్ట్రం లోనూ బీజేపీ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్నికల ఇంచార్జ్ పంతం సంజీవ, భయానంద్, మాజీ ఏఎంసీ చైర్మన్ పరమేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీపీ బీర్ల నరసింహ, ఐలయ్య, శివ, వెంకటేష్ ఉన్నారు.



## ధ్యానం గొప్ప జ్ఞానం మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్ నాయక్

అమంగల్ డిసెంబర్ 28 వార్త మిర్రర్: ధ్యానం గొప్ప జ్ఞానాన్ని ఇస్తుందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద ధ్యాన పిరమిడ్ మనకు అందుబాటులో ఉందని జీవ హింస చేయకుండా ధ్యానం చేసి మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని తెలిపారు. ప్రతి సంవత్సరం మహా ధ్యాన మహేశ్వర పిరమిడ్ ఆధ్వర్యంలో 11 రోజులపాటు ధ్యానం తో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ ధ్యానం కోసం దేశ విదేశాల నుంచి ప్రజలు తండోప తండాలుగా తరలి వస్తున్నారు అని తెలిపారు. ధ్యానుల వసతుల కోసం పిరమిడ్ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధ్యాన మహా పిరమిడ్ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి డైరెక్టర్ జోగు వీరయ్య ట్రస్ట్ సభ్యులు మాధవి తదితరులు పాల్గొన్నారు





## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 28 : ట్రాక్టర్ ప్రమాదం లో గాయపడిన వ్యక్తి మరణించిన సంఘటన జగిత్యాల జిల్లా రాయికల్ మండలం వస్తాపూర్ లో జరిగింది. రాయికల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తేదీ 21-12-2024 రోజున మృతుడు షేక్ మోహిత్, వ. షేక్ ముజాహిద్, 19సం, ముస్లిం, వస్తాపూర్ గ్రామం అనునతడు కట్కాపూర్ గ్రామ శివారు నందు మొరం లోడుతో ఉన్న ట్రాక్టర్ను నడుపుతూ ట్రాక్టర్ ను ఎత్తుగడ్డ ఎక్కించే క్రమంలో అజాగ్రత్తగా ట్రాక్టర్ నడపగా ట్రాక్టర్ యొక్క ఇంజన్ మరియు ముందు టైర్లు పైకి లేచి రివర్స్ గా తనపై పడడం వల్ల మృతుడు ట్రాక్టర్ నందు ఇరుక్కొని బలమైన గాయాలు కాగా మృతున్ని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ వెల్నెస్ హాస్పిటల్, హైదరాబాదు నందు ఈరోజు మరణించగా మృతుని తండ్రి షేక్ ముజాహిద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడమైనది రాయికల్ పోలీస్ లు తెలిపారు.

**ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పరామర్శ**

రాయికల్ మండలం వస్తాపూర్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ ముజాహిద్ కొడుకు మోహిద్ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ ఈరోజు మరణించగా వారి కుటుంబ సభ్యులను జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ జగిత్యాల జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంట నాయకులు నందు నాయక్,సురేందర్, తదితరులు పాల్గొన్నారు.



## 90 రోజుల యాక్షన్ ప్లాన్ ను సక్రమంగా అమలు చేయాలి

**జగిత్యాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి బి. నారాయణ**

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 28 : జగిత్యాల జిల్లా కలెక్టర్ భవన సముదాయంలో ఇటీవల ఇంటర్మీడియట్ విద్యాధికారిగా బి. నారాయణ నియమితులైన సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్-711 జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం రోజున ఆయన ఛాంబరులో కలిసి శాలువాతో సన్మానం చేసి బొకే అందించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ విద్యాధికారి బి.నారాయణ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి ఒక జూనియర్ లెక్చరర్ 90 రోజుల యాక్షన్ ప్లాన్ ను సక్రమంగా అమలు చేసి ఇంటర్మీడియట్ వార్షిక ఫలితాలలో అత్యుత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు వి. నరసయ్య, డాక్టర్ పి.తిరుపతి, రాజేష్, విజేందర్, ప్రమోద్ కుమార్, నరసయ్య, రాజేందర్, రవీందర్, దేవేందర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న ప్రీమియంలపైనే దిగులు

## జీవిత బీమా పాలసీదారుల మనోగతంపై సర్వే



న్యూఢిల్లీ : పాలసీదారులకున్న ఆందోళనల్లో పెరుగుతున్న జీవిత బీమా ప్రీమియం మొత్తాలే ప్రధానమైనవని ఓ సర్వేలో తేలింది. జీవిత బీమా కొనుగోలు నిర్ణయాన్ని ముఖ్యంగా మూడు అంశాలు ప్రభావితం చేస్తున్నట్టు మంగళవారం విడుదలైన ఈ సర్వే నివేదిక పేర్కొన్నది. అవసరాలు, ఆర్థిక పరిమితులు, స్థోమతల ఆధారంగా జీవిత బీమాపై పాలసీదారులు ఓ నిర్ణయానికి వస్తున్నట్టు హన్సా రిసెర్చ్ తెలిపింది. దేశవ్యాప్తంగా దాదాపు 3,300 మంది జీవిత బీమా పాలసీదారుల అభిప్రాయాలను సేకరించి ఈ నివేదికను హన్సా తయారు చేసింది. కాగా, ఏ సంస్థలోనైతే బీమాను తీసుకున్నామో.. ఆ కంపెనీ సహకరించకపోవడం వల్ల కూడా పాలసీలను కొనసాగించలేకపోతున్నట్టు 22 శాతం మంది చెప్పడం గమనార్హం. ఇక ప్రతీ 10 మంది పాలసీదారుల్లో 8 మంది కనీసం 6 నెలలకోసారైనా బీమాను కొన్న తర్వాత తమ ఏజెంట్‌ను కలుసుకోవాలని కోరుకుంటున్నారు. డిజిటల్, ఆన్‌లైన్ విధానాలపై పాలసీదారుల్లో ఉన్న అవగాహన రాహిత్యం కూడా జీవిత బీమా కొనుగోళ్లలో ప్రధాన అడ్డంకిగా మారుతున్నది. మొత్తానికి బీమా పాలసీల ప్రీమియంలు అందుబాటు ధరల్లో ఉండాలని మెజారిటీ ప్రజానీకం కోరుకుంటున్నట్టు తాజా సర్వే స్పష్టం చేసింది.

### ఐఆర్డీఏఐ నిర్ణయంపై హర్షం

జీవిత బీమా పాలసీలపై తీసుకున్న రుణాల చెల్లింపులను క్రెడిట్ కార్డుల ద్వారా చేయడాన్ని ఐఆర్డీఏఐ నిషేధించడంపట్ల బీమా కంపెనీలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నిర్ణయం వల్ల పాలసీదారులు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా ఉంటారని అభిప్రాయపడ్డాయి. బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్డీఏఐ ఇటీవల.. బీమా పాలసీలపై తీసుకున్న రుణాలకు సంబంధించి పాలసీదారులు క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లిస్తే అంగీకరించవద్దని ఆదేశించిన విషయం తెలిసిందే.

# గ్లోబల్ మార్కెట్లోకి పొకో ఎఫ్5 ప్రో.. ఇవీ స్పెషిఫికేషన్స్..!



ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ పొకో.. తన ఎఫ్ సిరీస్ 'పొకో ఎఫ్5 ప్రో 5జీ ఫోన్‌ను గ్లోబల్ మార్కెట్లో ఆవిష్కరించింది. ఒక్టాకోర్ క్వాల్ కామ్ స్నాప్ డ్రాగన్ 8ం జెన్ 1 ఎస్వోసీ ప్రాసెసర్, 120 హెర్ట్జ్ అమోలెడ్ డిస్ ప్లే విత్ సపోర్ట్ ఫర్ డోల్బీ విజన్ టెక్నాలజీతో వస్తున్నది. ఈ ఫోన్ ట్రిపుల్ రేర్ కెమెరా యూనిట్ కలిగి ఉంటుంది. 5160 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీ విత్ సపోర్ట్ 67 వాట్ల వైర్డ్ టర్బో చార్జింగ్ అండ్ 30 వాట్ల వైర్ లెస్ చార్జింగ్ తో వస్తుంది. పొకో ఎఫ్5 ప్రో 5జీ ఫోన్ 8జీబీ రామ్ విత్ 256 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ వేరియంట్ దాదాపు రూ.36,000 (449 డాలర్లు) పలుకుతుంది. 12 జీబీ రామ్ విత్ 256 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ వేరియంట్ సుమారు రూ.41,000 (499 డాలర్లు), టాప్ ఎండ్ మోడల్ 12 జీబీ రామ్ విత్ 512 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ వేరియంట్ ఫోన్ సుమారుగా రూ.45 వేలు (549 డాలర్లు) పలుకుతుంది. గ్లోబల్ మార్కెట్లో ఎర్లీ బర్డ్ ఆఫర్ కింద ఈ ఫోన్లు 429 డాలర్లు, 449 డాలర్లు, 499 డాలర్లకు లభిస్తాయి. బ్లాక్, వైట్ కలర్ ఆప్షన్లలో ఈ ఫోన్ లభిస్తుంది. ఈ ఫోన్‌ను భారత్ మార్కెట్లో ఎప్పుడు ఆవిష్కరిస్తారన్న సంగతి వెల్లడించలేదు. అయితే, పొకో ఎఫ్5 5జీ ఫోన్ ఇప్పటికే భారత్ మార్కెట్లోకి వచ్చేసింది. 8జీబీ రామ్ విత్ 256 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ వేరియంట్ ధర రూ.29,999 పలుకుతున్నది.

### ఇవీ పొకో ఎఫ్5 ప్రో 5జీ స్పెషిఫికేషన్లు

పొకో ఎఫ్5 5జీ ఫోన్‌లో మాదిరిగానే పొకో ఎఫ్5 ప్రో 5జీ ఫోన్‌లో కూడా సిమ్, సాఫ్ట్ వేర్, డిస్ ప్లే స్పెషిఫికేషన్లు ఉంటాయి. డ్యుయల్ (సిమ్) పొకో ఎఫ్5 ప్రో 5జీ ఫోన్ ఆండ్రాయిడ్ 13 బేస్డ్ ఎంఐయూఐ 14 వర్షన్‌పై పని చేస్తుంది. 6.67-అంగుళాల డబ్ల్యూక్యూహెచ్ డీ ం (1,440ఐ3,200 పిక్సెల్స్) ఫ్లో అమోలెడ్ డిస్ ప్లే విత్ 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేట్‌తో వస్తున్నది. 240 హెర్ట్జ్ టచ్ శాంప్లింగ్ రేట్, 1400 నిట్స్ పీక్ బ్రైట్ నెస్ కలిగి ఉంటది. పొకో ఎఫ్5 5జీ ఫోన్ ట్రిపుల్ రేర్ కెమెరా యూనిట్ తో వస్తున్నది. 64-మెగా పిక్సెల్ సెన్సర్, 8-మెగా పిక్సెల్ సెన్సర్ విత్ అల్ట్రా వైడ్ లెన్స్, 2-మెగా పిక్సెల్ సెన్సర్ విత్ మాక్రో లెన్స్ కెమెరాలు ఉంటాయి. సెల్ఫీల కోసం 16-మెగా పిక్సెల్ కెమెరా సెన్సర్ ఉంటుంది. పొకో ఎఫ్5 5జీ ఫోన్ మాదిరిగానే కనెక్టివిటీ ఆప్షన్లు ఉంటాయి.

# 200 కోట్లతో జడ్చర్ల ప్లాంట్ విస్తరణ

## ఈటో ఎండీ పవన్ చావలి



హైదరాబాద్ : రాష్ట్రానికి చెందిన విద్యుత్ ఆటోల తయారీ సంస్థ 'ఈటో' టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నది. దేశీయంగా ఈ ఆటోలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని వచ్చే ఏడాది 10 వేల యూనిట్ల వాహనాలను విక్రయించాలని లక్ష్యం గా పెట్టుకున్నది. ఇందుకోసం జడ్చర్ల వద్ద ఉన్న ప్లాంట్ సామర్థ్యాన్ని రెండింతలు పెంచడానికి రూ.200 కోట్ల మేర పెట్టుబడి పెట్టనున్నట్టు ఈటో మేనేజింగ్ డైరెక్టర్ పవన్ చావలి తెలిపారు. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 1,500 యూనిట్ల ఆటోలను విక్రయించిన సంస్థ..వీటిలో హైదరాబాద్ రోడ్లపైన 300 వరకు వాహనాలు దూసుకుపోతున్నాయి. ప్రస్తుతం ఈ యూనిట్‌లో నెలకు 300 నుంచి 400 వాహనాలు ఉత్పత్తి అవుతున్నాయి.

### మరో రెండు వాహనాలు

వచ్చే ఏడాదిలోగా మరో రెండు వాహనాలను విడుదల చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. దీంట్లో ఏడు సీట్ల కెపాసిటీ కలిగిన ఈ-ఆటోతోపాటు మినీ బస్సు కూడా ఉన్నది. ప్రస్తుతం సంస్థ రూ.3.5 లక్షలు మొదలుకొని రూ.4 లక్షల లోపు ధర కలిగిన ఆటోలను దేశీయంగా విక్రయిస్తున్నది. మరోవైపు, మహిళా సాధికారిత లక్ష్యంగా సంస్థ కీలక నిర్ణయం తీసుకున్నది. మహిళలకు ఉపాధి కల్పించడమే ప్రధాన ధ్యేయంగా హైదరాబాద్‌లో 200 మందికి పైగా మహిళలకు ఈ-ఆటోలు నడపడంపై ప్రత్యేకంగా శిక్షణ కూడా ఇస్తున్నట్టు చెప్పారు. త్వరలో వీరు డ్రైవింగ్ లైసెన్స్ పొంది హైదరాబాద్‌లో ఈ ఆటోలు నడపనున్నారు. ఇప్పటికే ఇలాంటి కార్యక్రమంగా గుజరాత్‌లో చేపట్టింది.

### తెలంగాణ ఈవీ పాలసీ భేష్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈవీ పాలసీ భేషుగ్గావున్నదని పవన్ వెల్లడించారు. ఇప్పటికే ఇక్కడ దేశీయ, అంతర్జాతీయ సంస్థలు తమ యూనిట్లను నెలకొల్పుతున్నాయని, ముఖ్యంగా ప్రత్యేక క్లస్టర్‌లో వాహనాలు ఉత్పత్తి అవుతున్నాయన్నారు. కాలుష్య ఉద్గారాలను తగ్గించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఆశాజనకంగా ఉన్నాయని చెప్పారు.

# దివాళా ప్రక్రియలో గో ఎయిర్.. స్లాట్స్‌పై టాటా.. ఇండిగో ఫోకస్!



నిధుల కొరతతో స్వచ్ఛంద దివాళా పరిష్కార ప్రక్రియ పిటిషన్ దాఖలు చేసిన ఎయిర్ లైన్స్ 'గోఫస్ట్' ఆస్తులు, లీజ్ హక్కులను సొంతం చేసుకునేందుకు టాటా సన్స్ ఆధీనంలోని ఎయిర్ ఇండియా, ఇండిగో ఎయిర్ లైన్స్ సంప్రదింపులు జరుపుతున్నాయి. దివాళా పరిష్కార ప్రక్రియ కోసం పిటిషన్ వేసినందున టికెట్ల విక్రయాలు నిలిపేయాలని గోఫస్ట్ యాజమాన్యాన్ని డీజీసీఏ ఆదేశించిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించేందుకు గో ఎయిర్, ఎయిర్ ఇండియా ప్రతినిధులు అందుబాటులోకి రాలేదు. ఇండిగో అధికార ప్రతినిధి కూడా ఊహాగానాలపై స్పందించబోమని స్పష్టం చేశారు. గో ఎయిర్ లైన్స్ లెజర్స్‌తో టాటా గ్రూప్, ఇండిగో యాజమాన్యాలు వేర్వేరుగా సంప్రదింపులు జరుపుతున్నాయని. గోఫస్ట్ విమానయాన సంస్థకు న్యూఢిల్లీ, ముంబైతోపాటు వివిధ ఎయిర్ పోర్ట్ ఆపరేటర్ల వద్ద గల ల్యాండింగ్, పార్కింగ్ స్లాట్స్ కోసం ఈ రెండు సంస్థల ప్రతినిధులు సంప్రదిస్తున్నట్లు తెలిసింది. గో ఎయిర్ లైన్స్ లెజర్స్ తమ 36 విమానాలను తిరిగి స్వాధీనం చేయాలని డీజీసీఏ వద్ద ఫైలింగ్ చేయనున్నాయి. వివిధ విమానాశ్రయాల్లో గోఫస్ట్ స్లాట్లను సొంతం చేసుకోవడానికి టాటా ఎయిర్ఇండియాతోపాటు న్యూ ఎయిర్ లైన్స్ ఆకాశ ఎయిర్ కూడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. గోఫస్ట్ విమానయాన సంస్థ రుణాల పునర్వ్యవస్థీకరణకు యత్నం, సర్వీసుల పునరుద్ధరణ సంక్లిష్టంగా మారాయన్న అభిప్రాయాల నేపథ్యంలో టికెట్ల విక్రయాలు నిలిపేయాలని ఆ సంస్థ యాజమాన్యాన్ని డీజీసీఏ ఆదేశించింది. గో ఎయిర్ విమానాల నిర్వహణకు ఆపరేటింగ్ లైసెన్స్ కొనసాగిస్తుందా.. లేదా? అన్న సంగతి రెండు వారాల్లో తేలనున్నది. గో ఎయిర్ సంస్థకు స్కై హై ఎక్స్ సీవీ లీజింగ్, ఏసీసీ ఎయిర్ క్రాఫ్ట్ లీజింగ్ ఐర్లాండ్, ఎస్ఎంబీసీ ఏవియేషన్ క్యాపిటల్ సంస్థలు ప్రధాన లీజుదారులుగా ఉన్నారు. 2005లో నుస్లీ వాడియా.. గో ఎయిర్ విమానయాన సంస్థను స్థాపించారు. తమ సంస్థ విమానాల్లో వాడుతున్న ప్రాట్ అండ్ విట్నీ ఇంజిన్లు ఊహించిన దానికన్నా వేగంగా దెబ్బ తింటున్నాయని, ముందస్తుగానే మూలన పడుతున్నాయని గో ఎయిర్ తెలిపింది. 2016 నుంచి గత ఫిబ్రవరి వరకు 500కి పైగా ప్రాట్ జీటీఎఫ్ ఇంజిన్లు రీప్లేస్ చేయాల్సి ఉందన్నారు. ఇంజిన్లు అందుబాటులో లేక విమాన సర్వీసులు నిలిపేయడంతో రూ. 10,800 కోట్ల నష్టాల్లో కూరుకున్నది. విడి భాగాల సరఫరాలో అంతరాయం, నూతన వాణిజ్య జెట్ లైనర్ విమానాల కొరతతో మరోసారి గో ఎయిర్ కష్టాలు వెలుగు చూశాయి. గతేడాది కేంద్రం నుంచి ఎయిర్ ఇండియాను స్వాధీనం చేసుకున్న టాటా.. మహారాజకు పూర్వ వైభవం తేవడానికి, విమాన సర్వీసులు పెంచడానికి చర్యలు చేపడుతున్నది. ఇటీవలే ఎయిర్ బస్, బోయింగ్ సంస్థలతో 470 విమానాల కొనుగోలుకు ఒప్పందాలు కుదుర్చుకున్నది. బడ్జెట్ ఆపరేటర్ ఇండిగో మార్చిలో దేశీయంగా 73 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చింది. దేశీయ విమానయాన మార్కెట్లో ఇండిగో దాదాపు 60 శాతం వాటా కలిగి ఉంది.



## శక్తి ఇన్ఫ్రా డెవలపర్స్ అధినేత బిజెపి నాయకులు బోడ వెంకటరమణ గౌడు కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గణేష్ సాగర్-రియాల్టర్ చంద్రమోహన్‌గౌడ్

హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి : హయత్ నగర్ శక్తి ఇన్ఫ్రా డెవలపర్స్, బిజెపి సీనియర్ నాయకులు బోడ వెంకటరమణా గౌడ్ జన్మదిన సందర్భంగా శక్తి ఇన్ఫ్రా డెవల పర్స్ కార్యాలయంలో కలిసి వెంకటరమణ గౌడు కు కేక్ కట్ చేయించి, శాలువాతో సత్క రించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన, వార్త మిర్రర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గణేష్ సాగర్, రియాల్టర్ చంద్రమోహన్ గౌడ్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోడ వెంకటరమణ గౌడ్ స్నేహానికి వన్నెతెచ్చే వ్యక్తిని, నిత్యం ఎల్బీనగర్ నియోజకవర్గ ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం కోసం తపించే గొప్ప రాజకీయ నాయకుడని అన్నారు, రియల్ ఎస్టేట్ రంగంలో నీతి నియమాలు పాటిస్తూ పేద మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా బలపడాలని లక్ష్యంతో వ్యాపారం చేస్తారని బోడ వెంకటరమణా గౌడ్ కొనియాడారు



## ఉప్పుమడుగు కస్తూర్బా విద్యార్థుల ఆందోళన

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 28 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని ఉప్పుమడుగు కస్తూర్బా విద్యార్థులు శనివారం మా టీచర్లు మాకే కావాలని ఆందోళన చేపట్టారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది గత 19 రోజులుగా జిల్లా కేంద్రంలో సమ్మె నిర్వహిస్తున్నారు. సమ్మెలో కస్తూర్బా సిబ్బంది పూర్తిస్థాయిలో పాల్గొనడంతో విద్యార్థులకు నష్టం కలగకుండా జిల్లా విద్యాధికారి రాము కొంత సిబ్బందిని కేటాయించారు. శనివారం కొత్త కొత్త టీచర్లు రావడంతో తమ టీచర్లు రారేమో అనీ స్కూల్ గేట్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ రాఘవులు విద్యార్థులతో మాట్లాడి సమ్మె విరమింప చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సంక్షిప్త భోజనం చేశారు.

## ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మల్యాల రాకేష్



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 28 : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 43వ రాష్ట్ర మహాసభలు 23,24,25 తేదీలలో సిద్దిపేట లో నిర్వహించుకోవడం జరిగింది. ఈ యొక్క రాష్ట్ర మహాసభలలో అనేక రకాల విద్యారంగ మరియు సామాజిక సమస్యల పైన అనేక తీర్మానాలు చేయడం జరిగింది. అనంతరం 2024-25 కి సంబంధించిన ఏబీవీపీ నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి ప్రకటించడం జరిగింది. ఈ యొక్క నూతన కార్యవర్గం లో జగిత్యాల జిల్లా మల్యాల కి చెందిన మల్యాల రాకేష్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గా ఎన్నికవడం జరిగింది. గతంలో రాకేష్ సోషల్ మీడియా ఇంచార్జ్ గా, ఎస్ఆర్ఆర్ జోనల్ ఇంచార్జ్ గా, కరినగర్ నగర కార్యదర్శి గా,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గా, కరీంనగర్ జిల్లా కన్వీనర్ గా, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబెర్ గా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాల్యాల రాకేష్ మాట్లాడుతూ నన్ను నమ్మి రాష్ట్ర శాఖలో స్థానం కల్పించి రెండవ సారి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గా ఎన్నుకున్న రాష్ట్ర శాఖకు ధన్యవాదాలు తెలియజేసారు. అలాగే అనునిత్యం విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాను అని అన్నారు. రాకేష్ ఎన్నిక పట్ల కరీంనగర్ విభాగ్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

## 2లక్షలు పైబడిన రుణాలను 2లక్షల వరకు వెంటనే మాఫీ చేయాలి

### బీజేపీ రాయికల్ మండల అధ్యక్షుడు అన్నవేణి వేణు



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 28 : రెండు లక్షలు పైబడిన ఋణాలను, రెండు లక్షల వరకు రేషన్ కార్డుతో సంబంధం లేకుండా, పట్టా బుక్ ఆధారంగా మాఫీ చేయాలని, ఎన్నికల హామీ లో ఇదే విధంగా చెప్పి గద్దెనెక్కిన తర్వాత రుణమాఫీ కి కొర్రీలు పెడుతూ లబ్దిదారులను తగ్గించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని, రాయికల్ మండల వ్యాప్తంగా ఇంకా 40 శాతం వరకు మాఫీ కాని రైతులు ఉన్నారని, అసలు వాళ్లకు మాఫీ అవుతుందో కాదో అని, రోజు వ్యవసాయ శాఖ మరియు బ్యాంకు ల చుట్టూ తిరుగుతున్నారని, ఏ అధికారిని అడిగినా కూడా తెలియదు అనే సమాధానం వస్తుంది అని, అసలు పరిపాలన అంటే తెలియని ప్రభుత్వాన్ని ప్రజలు మొదటిసారిగా చూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ విధానాలతో ఇంకో 50 సంవత్సరాల వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే తెలంగాణ ప్రజలు ఉలిక్కిపడేలా అధికారంలోకి వచ్చిన సంవత్సరం లోపే ఇంతటి అప్రతిష్టను మూటగట్టుకున్న ప్రభుత్వం గా కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందని, రాయికల్ మండల వ్యాప్తంగా రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరిస్తున్నామని, వారందరితో కలిసి మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్నామని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు అన్నవేణి వేణు పత్రిక ప్రకటనలో తెలిపారు.